క్లుప్తంగా

వారపు సంత వేలం రూ.8.80 లక్షలకు ఖరారు

మాడుగుల: స్థానిక పంచాయతీ కార్యాలయంలో మాడుగుల వారపు సంత వేలం పాట సోమవారం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.8.80 లక్షలకు గొర్లె సూర్యనారాయణ పాడి దక్కించుకున్నాడు. మండల పంచాయతీ విస్తరణాధికారి పి.ఎస్.ఎల్. మీనాకుమారి, సర్పంచ్ యడ్ల కళావతి, పంచాయతీ ఈవో చీపురుపల్లి నాయుడు సారథ్యంలో జరిగిన ఈ వేలంలో 14 మంది పాల్గొన్నారు. గతేడాది రూ.8.56 లక్షలకు వేలం పాడగా, ఈ ఏడాది రూ.24 వేల ఆదాయం పెరిగింది. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



మాట్లాడుతున్న హెచ్ఎం వరప్రసాద్

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డి.ఎస్.ఎస్. వరప్రసాద్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పలు గ్రామాల్లో పోలీసు కవాతు

బుచ్చెయ్యపేట: రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాల్లోని ప్రజల భయాందోళనలు పోయేలా ముందస్తు చర్యల్లో భాగంగా బుచ్చెయ్యపేట, వడ్డాది మేజర్ పంచాయతీ, దిబ్బిడి, పోలేపల్లి, రాజాం తదితర గ్రామాల్లో కొత్తకోట సీఐ ఎల్ అప్పలనాయుడు, బుచ్చెయ్యపేట, రావికమతం ఎస్ఐలు డి. ఈశ్వరరావు, ధనుంజయ్ నాయుడు తమ సిబ్బందితోపాటు ఆర్పీఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు.

సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం

చోడవరం: సమయపాలన లేకుండా విధులకు వస్తున్న గాంధీ గ్రామం సచివాలయ సిబ్బంది తీరుపై సర్పంచ్ గాడి అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఇక్కడ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ప్రధానంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ పనితీరు మార్చుకోవాలన్నారు. జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విధి నిర్వహణలో తాను ఎటువంటి నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయిశ్రీ వివరణ ఇచ్చారు. 14 రోజుల పాటు మెడికల్ లీవ్‌లో ఉండి, ఇప్పుడు జాయినింగ్ రిపోర్టు ఇవ్వడానికి వచ్చినప్పుడు సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారని వాపోయారు. సెలవు సమాచారం పంచాయతీ కార్యదర్శికి ఇచ్చానన్నారు.

ఘనంగా ఉమాభారతి వైద్యనాథేశ్వరస్వామి ఉత్సవం


అన్నసమారాధనలో భక్తులు

రోలుగుంట: స్థానిక కొండ ప్రాంతంలో ఉమాభారతి వైద్యనాథేశ్వరస్వామి ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక మహా శివరాత్రి తర్వాత నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయానికి భక్తులు అలయ నిర్వాహకుడు ఆదారి గణేష్ పాత్రో ఆధ్వర్యంలో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లి పంచాయతీ శివారు పందూరుపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థం మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. సోమవారం ఈ పోటీలను సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పందూరి సరువునాయుడు జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.1,500, రూ.వెయ్యి చొప్పున బహుమతులు ప్రదానం చేశారు.

సాగుదారులకు సర్వహక్కులు


పట్టాలు పంపిణీకి విచ్చేసిన లబ్ధిదారులు


సాగుదారులకు ఫ్రీహోల్డ్ పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

- నర్సీపట్నం నియోజకవర్గంలో 1,200 మందికి లబ్ధి
- ఫ్రీహోల్డ్ పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ప్రభుత్వ నిర్ణయంతో సాగుదారులకు ప్రయోజనం చేకూరిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన డీ–పట్టాలు(ఫ్రీ హోల్డ్ పట్టాలు), ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పేదల గోడు గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో 20 ఏళ్ల తరబడి సాగులో ఉన్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నియోజకవర్గంలో 1,200 మంది సాగుదారులకు ప్రయోజనం చేకూరిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు హక్కు కల్పిస్తూ సాగుదారుల్లో ఆనందం నింపారన్నారు. నాతవరం మండలంలో 146మందికి 147 ఎకరాలు, గొలుగొండ మండలంలో 234 మందికి 365 ఎకరాలు, నర్సీపట్నం మండలంలో 62 మందికి 60 ఎకరాలకు భూహక్కు పట్టాలు అందజేసినట్లు తెలిపారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ...

జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి సర్వహక్కులు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. నియోజకవర్గంలోని నాతవరం, నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం మండలాలకు సంబంధించి 3,200 మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంటి స్థలాలను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేర్చారన్నారు. జగనన్న కాలనీలు గ్రామాలుగా రూపుదిద్దుకుంటున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించిన ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. ప్రతి ఇంట్లో మంచి జరిగిందనుకుంటేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుంటే మరింత మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హెచ్.వి.జయరాం, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, ఎంపీపీలు సాగిన లక్ష్మణ్‌మూర్తి, మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, సుర్ల సత్యనారాయణ, తహసీల్దార్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చోడవరం మండలంలో ఎనలేని అభివృద్ధి

సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

చోడవరం: మండలంలో ఐదేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన చోడవరం మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. కొన్ని శాఖల అధికారుల నిర్లక్ష్యం, పనితీరు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కె.రమామణి మండల పరిషత్ నివేదికను చదివి వినిపించిన అనంతరం ఒక్కొక్క శాఖల వారీగా పనితీరు నివేదిక ఉంచారు. విద్యుత్, ఐసీడీఎస్ శాఖల పనితీరుపై పలువురు సభ్యులు సమావేశంలో ఫిర్యాదు చేశారు. నర్సయ్యపేట వద్ద పంట కాలువ తవ్వకపోవడంతో లక్ష్మీపురం చెరువు నుంచి దిగువకు వస్తున్న వరదనీరు పొలాలను ముంచేస్తుందని కొందరు సభ్యులు ప్రశ్నించగా, వెంటనే ఎన్ఆర్‌జీఎస్ ద్వారా పనులు చేపడతామని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లోనూ మంచినీటి సమస్య లేకుండా ఇప్పటికే ఇంటింటి కుళాయిలు వేశామన్నారు. ఈ వేసవికి ఎక్కడైనా నీటి ఎద్దడి ఉంటే, అవసరమైన చోట్ల చేతి పంపులు వేస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంఈవో రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, సూపరింటెండెంట్ అమ్మాజి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని మించి రూ.52 కోట్ల లింకేజీ రుణాలు


వివరాలు తెలుపుతున్న వెలుగు ఏపీఎం లక్ష్మి

నాతవరం: ఈ ఏడాది 1,115 డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.43 కోట్లు లక్ష్యం కాగా, రూ.52 కోట్లు ఇచ్చామని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి సోమవారం తెలిపారు. లక్ష్యాన్ని అధిగమించి స్త్రీనిధి నుంచి రూ.8 కోట్లు 1,420 మంది సభ్యులకు ఇచ్చామన్నారు. వీటితోపాటు ఉన్నతి పథకంలో 1,361 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.70 లక్షలకు పైగా రుణాలు ఇచ్చామన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో అర్హత కలిగిన గ్రూపుల ఖాతాల్లో రూ.10 కోట్లు పైగా జమ చేశామన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ చేయూత నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయన్నారు. ఈఏడాది మండల వ్యాప్తంగా పీఎంఈజీపీలో పలు యూనిట్ల ఏర్పాటుకు 141 మంది లబ్ధిదారులకు రుణాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత ఊరులోనే ప్రభుత్వ సేవలు

నూతన భవనాలకు ప్రారంభోత్సవం చేసిన ఎంపీపీ రాజేశ్వరి


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: మండల కేంద్రాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సొంత ఊరులోనే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి తెలిపారు. రూ.1.50 లక్షలతో ధర్మసాగరం, నీలంపేట, చెట్టుపల్లి, గబ్బాడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, నాడు–నేడు నిధులతో పూర్తి చేసిన స్కూల్ భవనాలను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ సేవలు సమర్థవంతంగా అమలు కావాలంటే మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే గణేష్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. సర్పంచ్ ఫోరం మండలాధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీలు ఇన్నం రత్నం, కూండ్రపు తాతబాబు, ఎంపీటీసీ తాతమ్మ, సర్పంచ్ సత్యవతి, ఎంపీడీవో జాన్ లింకన్, ఏవో సీహెచ్.వి.రమణబాబు, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు దన్నిన నానాజీ, మండల సచివాలయాల కన్వీనర్ శానపతి వెంకటరత్నం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య బాధ్యత కార్యదర్శులదే

- ఎంపీడీవో జాగరపు రాంబాబు


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రంగా ఉండాలన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీరు సమస్య తలెత్తకూడదన్నారు. ఎమ్మెల్యే గణేష్ ఆదేశాల ప్రకారం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 15పైగా బోర్లు వేస్తున్నామన్నారు. ఈ నెలాఖరులోగా ఇంటి పన్నులు శత శాతం వసూలు చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నూతన భవన నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికారులంతా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఎన్.ఎస్.వి.మూర్తి, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

రావికమతం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ పైల రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా పాల్గొని ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు


శెట్టిపాలెంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

మాకవరపాలెం: సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. భీమబోయినపాలెంలో రూ.40 లక్షలతో సచివాలయ, రూ.23.94 లక్షలతో శెట్టిపాలెంలో నిర్మించిన ఆర్బీకే భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షల చొప్పున విడుదల చేసిందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, ఎంపీడీవో చంద్రరావు, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, పీఆర్ జేఈ వెంకటేశ్వరరావు, వాసుదేవనాయుడు పాల్గొన్నారు.

4 వాటరు ట్యాంకుల ప్రారంభోత్సవం నేడు

3 పంచాయతీల్లో రూ.3.67 కోట్లతో నిర్మాణం పూర్తి


తునివలసలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకు

చీడికాడ: మండలంలోని మూడు పంచాయతీల్లో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.3.67 కోట్లతో నిర్మించిన నాలుగు వాటరు ట్యాంకులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం ఉదయం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. వేసవి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జి.కొత్తపల్లిలో రూ.1.25 కోట్లు, జేబీపురంలో రూ.1.50 కోట్లు, తునివలస పంచాయతీ తునివలసలో రూ.55 లక్షలు, వింటిపాలెంలో రూ.37 లక్షలతో ట్యాంకులను నిర్మించగా, పైపు లైన్లు పూర్తి చేసి ప్రతి ఇంటికి కుళాయిలను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు.

ఎ.కొత్తపల్లిలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం..

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు.

మహిళా న్యాయమూర్తులకు ఘన సన్మానం


మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు

చోడవరం రూరల్: చోడవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కోర్టుల సముదాయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి కె.రతన్‌కుమార్, సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ, ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి పి.ప్రదీప, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వసంత రమణమ్మ మహిళా దినోత్సవ విశిష్టతను వివరించారు. వీరితోపాటు మహిళా న్యాయవాదులు బి.రజనీకాంతి, కందర్ప అన్నపూర్ణ, గొర్లె కృష్ణవేణి, కందర్ప వెంకటమంజు, కె.నళిని, ఎస్.సుబ్బలక్ష్మి, డి.ఎస్.వి.భారతి అపర్ణ, డి.సత్యవతి, ఆర్.పద్మావతి, శ్యామల, శారద, గౌరి, జ్యోతిలను అధ్యక్షుడు కే డేవిడ్, తదితరులు సత్కరించారు.

బుచ్చెయ్యపేటలో రూ.831 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


అధికారులనుప్రశ్నిస్తున్న నాయకులు



బుచ్చెయ్యపేట: మండలంలో ఐదేళ్ల కాలంలో రూ.831 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన సోమవారం బుచ్చెయ్యపేట మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎర్రవాయి ప్రాంతంలో వెనకబాటుతనం పోవాలని అన్ని గ్రామాలకు రోడ్లు, సచివాలయ, హెల్త్ సెంటర్లు, ఆర్బీకే, కమ్యూనిటీ భవనాలతోపాటు ఇంటింటి కుళాయిలు, మంచినీటి ట్యాంకుల నిర్మాణాలు చేపట్టామన్నారు. మరలా ఎన్నికల తర్వాత అన్ని గ్రామాల్లో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సహకరించిన సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ఇతర ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్.బి.పురం, నీలకంఠాపురంలో కూలీలకు ఉపాధి పనులు చెప్పకపోవడంపై సర్పంచ్‌లు తమరాన శ్రీనువాసరావు, పడాల నాగభూషణం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమళ్లపూడిలో నాలుగు మంచినీటి బోర్లకు మోటార్లు బిగించి వ్యవసాయానికి వినియోగించడంపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని జేఈ, ఎంపీడీవోలపై జెడ్పీటీసీ దొండా రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో అనర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో వెంకటాచార్య, ఐసీడీఎస్ పీవో ఉషారాణి పాల్గొన్నారు.

ధర్మశ్రీకి గజమాలతో ఘన సత్కారం

బుచ్చెయ్యపేట: బుదిరెడ్లపాలెంలో రూ.40 లక్షలు, పొట్టిదొరపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాలను విప్ కరణం ధర్మశ్రీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన్ను పీఏసీఎస్ అధ్యక్షుడు మోటూరి చిన్నంనాయుడు, గుమ్మిడి శ్రీను, నందవరపు రమేష్, మోటూరి గోవింద గజమాలతో ఘనంగా సత్కరించారు.

గణిత మేళా విజేతలు గవరవరం, దుడ్డుపాలెం


ప్రథమ బహుమతి అందిస్తున్న ఉపాధ్యాయులు

చోడవరం రూరల్: జుత్తాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా గణిత మేళా నిర్వహించారు. మండల స్థాయిలో జరిగిన పోటీల్లో 30 పాఠశాలల నుంచి విద్యార్థి జట్లు పాల్గొన్నాయి. గుమ్మలూరి కృష్ణవేణి త్యాగరాజు చెల్లూరి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఎంఈవో విజయలక్ష్మి ప్రారంభించారు. న్యాయ నిర్ణేతగా ఆర్.ఆనంద్‌కుమార్ వ్యవహరించారు. ఉన్నత పాఠశాల స్థాయిలో గవరవరం ప్రథమ స్థానాన్ని, జుత్తాడ ద్వితీయ, శ్రీవిజ్ఞాన్ తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రాథమిక స్థాయిలో దుడ్డుపాలెం, జుత్తాడ, రవి కాన్వెంట్ జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందాయి.

సుప్రీం కోర్టు తీర్పు పట్ల హర్షం

నర్సీపట్నం: ఈ నెల 15వ తేదీలోగా ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని నర్సీపట్నం టాక్స్ పేయర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు అందుకున్న రూ.6,565 కోట్ల విలువ గల బాండ్ల వివరాలు బయటకు వస్తే, పాలకులకు ఎంత మేర ముడుపులు అందాయో తెలుస్తుందన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి

కె.కోటపాడు: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం జిల్లా నాయకుడు గండి నాయినిబాబు తెలిపారు. పార్టీ పిలుపు మేరకు సోమవారం స్థానిక ఎస్‌బీఐ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు, సబ్బవరపు శివ, కక్కల దేముడు పాల్గొన్నారు.

నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం

- జగనన్న ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసిన ధర్మశ్రీ


ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ఇళ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కల నిజం చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం నర్సాపురంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 40 మందికి ప్రభుత్వం సమకూర్చిన సొంతింటి రిజిస్ట్రేషన్ పత్రాలను ధర్మశ్రీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొంతింటిలో ఉండాలన్న ఆశయంతో జగనన్న కాలనీల్లో ఉచితంగా ఇంటి స్థలాలిచ్చి, హౌసింగ్ స్కీమ్ ఇచ్చామన్నారు. ఆ ఇంటి స్థలంపై పూర్తిగా రిజిస్ట్రేషన్ హక్కు కల్పించారన్నారు. నియోజకవర్గంలో 4,800 మందికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందన్నారు. వారంతా పూర్తిగా ఇళ్లను నిర్మించుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాలరావు, సర్పంచ్ ఉగ్గిన నాగబాబు, ఎంపీపీ గాడి కాసు, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కింతలి- ఘాట్‌రోడ్ పనులు


కింతలి రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో రూ.9 కోట్లతో మండలంలో కింతలి– ఘాట్‌రోడ్ పనులు ప్రారంభించారు. ఈ పనులను ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ సోమవారం పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతగా చేయాలన్నారు. ఈ పనులతో ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న 30 గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మాడుగుల 3వ వార్డులో గడపగడప నిధుల నుంచి డిప్యూటీ సీఎం రూ.8 లక్షలు చేయడంతో సీసీ డ్రైనేజీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పనులను సర్పంచ్ ఎడ్ల కళావతి పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో సీహెచ్ నాయుడు, గుత్తేదారుడు ఎడ్ల హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

సిటీ క్లబ్‌పై చర్యలు తీసుకోకపోతే నిరాహార దీక్ష

- ఆర్డీవో స్పందనలో చెరువుల పరిరక్షణ సమితి ఫిర్యాదు

నర్సీపట్నం: సిటీ క్లబ్ అక్రమ నిర్మాణాలపై ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పులిగా రామ్మోహన్ మురళీ ఆర్డీవో స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని కార్యాలయ ఏవో ప్రకాష్‌రావును కోరారు. సర్వే నంబరు 357/3లో 55 సెంట్లు గ్రామ కంఠాన్ని సిటీ క్లబ్‌గా మార్చి జూదశాల నిర్వహిస్తున్నారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా 11 షాపులు నిర్మించి అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సిటీ క్లబ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోతే నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఈ వారం స్పందనలో 15 అర్జీలు అందాయి. ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఏవో అర్జీదారులకు హామీ ఇచ్చారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం


రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న నేతలు

గొలుగొండ: సీఎం జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జెలపు మణికుమారి తెలిపారు. సోమవారం చోద్యంలో రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. 57 మందికి జగనన్న గృహ రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం ఆర్బీకేలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జీ, గాదంపాలెం సర్పంచ్ నల్లబిల్లి శ్రీనివాస్, పార్టీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, కె.వల్లాపురం

టెండరు ప్రకటన

రేఖా నెం: 81/2024/బి2 — తేది 11/03/2024

అనకాపల్లి జిల్లా, వి.మాడుగుల మండలం, కె.వల్లాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఆదాయ వనరులు అనగా వారపు సంత 2024–2025 సంవత్సరమునకు బహిరంగ వేలం ద్వారా లీజుకిచ్చి అతీలు వసూలు చేసుకొనుటకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం –1994 సెక్షన్ 44 ఉప సెక్షన్ (4) అనుసరించి, కె.వల్లాపురం గ్రామ పంచాయతీనకు ఈ దిగువ తెలిపిన విధముగా మద్దతు ధర నిర్ణయించుచూ ఉత్తర్వులు జారీచేయడమైనది.

వ. నెం.	ఆదాయ వనరుల వివరములు	కాలము (సంగరము)	వేలం తేది/ సమయం	డిపాజిట్ ధర	సర్కారు పాట (మద్దతు ధర)
1.	వారపు సంత	2024–25	13-03-2024 ఉ॥11.00 గం॥	15,000/-	రూ. 56,420/-లు

సదరు బహిరంగ వేలం ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 496 పంచాయతీరాజ్ తే॥ 11.06.1996ది అనుగుణంగా జారీచేయబడిన నిబంధనలు పాటిస్తూ, సంబంధిత పంచాయతీ కార్యదర్శి, కె.వల్లాపురం గ్రామ పంచాయతీ వారు సదరు బహిరంగ వేలమును పంచాయతీ కార్యాలయం నందు విస్తరణాధికారి (పం.రా. & గ్రా.అ.), వి.మాడుగుల మండలము వారి సమక్షములో వేలం నిర్వహించబడును.

పంచాయతీ కార్యదర్శి, కె.వల్లాపురం గ్రామ పంచాయతీ
కె.వల్లాపురం, వి.మాడుగుల మండలం